# సారం - సంసారం

"రేపు జనరల్ రజనటగదా? అన్నాడు వెంకటి.

"ఔ శివాజీ జయంతి గదా, జనరల్ రజనే" జవాబిచ్చాదు భీమన్న.

"ఐతే రేపు కోటీదంతా(గదంతా) నిండి పోతది. అందరూ ఇంట్లనే ఉంటరు గదా"

"నేనైతే కుర్లకు పోతా, మా బామ్మర్ది జెప్పిండు. దగ్గర దగ్గర ఆర్నెల్లాయె ఆల్లింటికి పోక"

"నాకోల్లున్నరు పోయెతందుకు? పొద్దుగల్ల ఇంట్లనే ఉంట. సాయంత్రం చౌపాటీకి పోతా"

అది వర్లీ–బొంబాయిలోని ఒక చాల్(బిల్డింగ్). దాంట్లో ఒక వంద చదరపు అడుగుల గది. ఓ పదిమంది మిల్లు కార్మికుల "పండే కోటీడు" (లాడ్జి). క్రింద ఆరుగురు, కట్టెచెక్కలతో వేసిన అటకపై నలుగురు పడుకుంటారు. అటకపై కూర్చోవడానికే తప్ప వంగడానికి కూలా వీలుకాదు. గదికి ఓ మూలన ఓపెన్ బాత్‌రూం. దాంట్లో ఒక కుళాయి. బాత్రూం పక్కన ఓ పెద్ద డ్రమ్ము నీళ్లు నిలవ చేసుకోవడానికి వీలుగా ఉంది.

బొంబాయి మహానగరంలో, కార్మిక విభాగాలైన వర్లీ, పరేల్, గాయిగాం, కామారిపురాలో ఇలాంటి పండే "కొటీళ్ళు" చాలా ఉన్నయి. వీటిల్లో వుండేవారు వేరు వేరు షిఫ్టుల్లో పని చేస్తుండటం వల్ల ఏ మూడు నాలుగు నెలలకోసారో జనరల్ సెలవు దినం ఉంటే తప్ప అందరూ ఒకసారి రూంలో ఉండరు. ఉదయం ఏడు గంటల నుండి పగలు మూడు గంటల వరకు మొదటి షిఫ్టు, మూడు గంటల నుండి పదకొండు గంటల వరకు రెండవ షిఫ్టు, పదకొండు గంటల నుండి మర్నాటి ఉదయం ఏడు గంటల వరకు మూడవ షిఫ్టు ఉంటాయి. నెలలో ముప్పై రోజులూ మిల్లు పని చేస్తుంటే, వారంలో ఏదో ఒక రోజు వేరు వేరు కార్మికులకు సెలవు వుంటుంది.

భీమన్న, వెంకటి ఒకే "పండే కోటీడు"లోని సహవాసులు. భీమన్న బొంబాయి వచ్చి ఇరవై సంవత్సరాలకు పైగా కాగా వెంకటి మాత్రం ఆరు నెలల క్రిందటే వచ్చాడు. ఒక మిల్లులో "అప్రెంటిస్ వీవర్"గా ఉన్నాడు. వారి మాటల్లో అద్దె ప్రసక్తి వచ్చింది.

"అచ్చే నెల నుంచి తొంబై రూపాయలు బాడిగె జేస్తరట" భీమన్న.

"అయిదు నెల్ల క్రింద పదిగేను రూపాలు బాడిగె పెంచింద్రు. మల్ల పది పెంచుతరటనా?" వెంకటి ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"పెంచకేం జేత్తరు? దిన దినంకు ఇండ్ల ధరలు పెరుగుతున్నై. ఓల్లకన్న

కట్లకు(కుటుంబం) కొటీడు(గది) బాడుగకిత్తే, యాడాదికి పన్నెండు వేలు ఇత్తున్నరు. అవి అడ్డికిచ్చుకుంటే (వడ్డీకి ఇస్తే) నెలకు రెండు మూడు నూర్లు ఎక్క దొర్కుతై. నెల నెలకు పదిమంది దగ్గర బాడిగె వసూలు జేసే తిప్పలు ఉండది. మన శేటు కావట్టి ఇన్నేండ్ల నుంచి ఇది "పండే కొటీడు"గ ఉంచిండు కట్లకు బాడిగె కియ్యలే" జవాబిచ్చాడు భీమన్న.

మెగాసిటీ బొంబాయిలో రోజుకు మూడు రూపాయలలో లాడ్జింగ్ సౌకర్యం! కారు చవక కదూ!

"ఇరువై వేండ్ల నుంచి బొంబాయిల పనిజేత్తున్నవు గదా! ఒక కొటీడన్న కొనుక్కొనలేదేమే భీమన్నా"

"నీకేం జెప్పాల తమ్మీ! కొటీడుకు ఇరవై ముప్పై వేయిలున్నప్పుడు, ఎంతో మంది కొనుక్కోమన్నరు. అప్పుడు పగారు(నెలజీతం) తక్కుండే, బాకీ దీసి రూం కొనేందుకు ధైర్యం రాకపోయె. ఇప్పుడేమో రెండు లక్షలకు తక్కువకు కొటీడు రాదు"

అవును ఈ రోజుల్లో వంద చదరపు అడుగుల గది కొనాలంటే రెండు మూడు లక్షల రూపాయలు కావాలి మరి!

"ఇన్నేండ్ల నుంచి పండే కొటీడ్లనే ఉన్నవా? ఎప్పుడన్నా మీ కట్లను తీసికొచ్చినవా?"

"ఇరవై ఏండ్ల నుంచి ఇదే కొటీడ్ల ఉన్నా. అప్పుడు నెలకు పది రూపాయలు బాడిగ ఉండే. ఇప్పుడు నూరు రూపాల దగ్గరికచ్చే. రెండుసార్లు బొంబాయి సూపిచ్చెతందుకు పిల్లలను తొలుకవచ్చినా. గణపతి పండుగప్పుడు ఒకసారి. దీలె (దీపావళి) తాతీల్లప్పుడొకసారి అచ్చి(వచ్చి) కుర్లకు మా బామ్మర్ది ఇంట్ల ఉన్నారు"

"అయితే ఇరవై ఏండ్ల నుంచి పొట్టగాల్ల దగ్గరనే తింటున్నవా?"

"ఏక్ సౌ ఆఠ్ (వర్లీ బి.డి.డి. చాల్ నెం. 108)ల సాయెల మల్లక్క దగ్గర ఎనిమిదేండ్లు తిన్న ఆమె కాలం జేసినంక పన్నెండేండ్ల నుంచి ఏక్ సౌ పాంచ్(105)ల మల్లాల ముత్తెమ్మ ఇంట్ల దింటున్న అదే అలవాటయింది. అచ్చే నెలనుంచి పొట్టకు గూడా నన్నూట డెబ్బై అయిదు సెత్తరట."

ఒంటరిగా ఉంటూ, మిల్లులోనో, ఫ్యాక్టరీలోనో, టైలర్ గానో పనిచేసే కార్మికులు, పొట్టగాల్ల (పూటకూళ్లమ్మల) దగ్గర భోజనం చేస్తారు. ఒక్కో పూటకూళ్లమ్మ దగ్గర, ముప్పై నుండి ఎనభై మంది వరకు భోంచేస్తారు. రెండు పూటలా కడుపునిండా భోజనానికి, నెలకు నాలుగు వందల రూపాయల నుండి అయిదు వందల వరకు తీసుకుంటారు. తీసుకునే చార్జిని బట్టి వారంలో రెంజు రోజుల నుండి నాలుగు రోజులు మాంసాహారం పెడతారు. ఈ పొట్టగాల్లు కార్మికుల పాలిటి అన్నపూర్ణలు. ఈ రోజుల్లో కూడా బొంబాయి లాంటి మహానగరంలో పూటకు ఎనిమిది రూపాలలో అన్నం పెడుతున్నారంటే వారు సాక్షాత్తూ "అన్నపూర్ణాదేవి" అవతారాలు కాదంటారా? అదే హోటల్లో అయితే ముప్పై రూపాయల ఖర్చు చేసినా కడుపు నిండా భోజనం దొరకదు.

"పొట్టగాల్ల దగ్గర తిని, తిని యాష్ట రాలేదా? పిల్లగాండ్లను దేశంల ఉంచి, ఇన్నేండ్ల నుంచి ఒక్కడవే ఎట్లుంటున్నౌ? దేశంల మీ వోల్లు ఎల్లుంటున్నరు?" తన ప్రశ్నల పరంపరను కొనసాగించాడు వెంకటి.

"ఏం జెయ్యాల, నశీబు మాట. పది నెలలు బొంబాయిల పనిజేయాల, రెండు నెలలు దేశంల ఉండి రావాల. ఈ జిందగీ ఇట్లనే గడిసే. వయసు మీద పిల్లగాండ్లను తోలకచ్చుకుందమంటే ఈడ కొటీదు లేకపోయె. ఆడ ముసలోల్లను సూసె టోల్లు లేకపోయిరి. ఇప్పుడు ముసలోల్లు పోయింఢ్రు కాని కొటీదు కొనేతందుకు శాత(చేత) గాదు."

"నాతో నైతే ఇట్లుండుడు గాదు. ఆర్నెల్లకే యాష్టకత్తున్నది. బదిలి పాసు (టెంపరరీ పాసు) పుట్టగనే, బై టూర్ల రూం జూసుకొని కట్లను తీసుకత్త." మిల్లులుండే విభాగంలో కాక దాదాపు పదిహేను ఇరవై కిలో మీటర్ల దూరంలోని నగర శివార్లలో అయితే ఇంటికి అద్దె కాస్త తక్కువగా ఉంటుంది. కాని రాను పోను మూడు నాలుగు గంటలు సబర్బన్ రైళ్లల్లో ప్రయాణం చేయాలి.

ఒక సుఖం రావాలంటే వేరొక అసౌకర్యం తప్పదు. ఆ సంభాషణ అంతటితో ఆపి భీమన్న ఏదో పనిమీద బయలుదేరాడు.

బాగా ప్రొద్దు పోయాక, కాస్త మంచి తీర్థం (వారుణి వాహిని లాంటి ఇక్కడి ప్రభుత్వ సారా) పుచ్చుకుని భోంచేసి వచ్చాడు భీమన్న. పడుకున్నాడు కాని నిద్ర రావడంలేదు. వెంకటి మాటలు పదే పదే జ్ఞాపకం వస్తున్నాయి.

అవును, ఇన్నేండ్ల నుంచి తాను ఎలాంటి జీవితం గడిపాడు? ఈనాడు వెంకటిలో ఉన్న ఆలోచన తనకు ఆనాడు ఉండి ఉంటే, తన కుటుంబం ఇలా అయేది కాదు కదా?... పెళ్లైన తన పెద్ద కూతురు ఇప్పుడు ఇంటి మీదే ఉంది. హడావిడిగా, వివరాలు కనుక్కోకుండా, బంధువుల ప్రోద్భలంతో చేసిన పెళ్లి ఇప్పుడు విడాకులకు దారితీసేదిగా ఉంది. అల్లుడు వ్యసన లోలుడే కాదు, పని దొంగ కూడా. అంతే కాదు, తన కూతురు బీడీలు చేసి గుట్టుగా సంసారం వెళ్లదీస్తున్నా, తిట్టి, కొట్టి హింసించే మూర్ఖుడు.

ఇక కొడుకులు? పెద్దవాడికి పద్దెనిమిదేళ్లొచ్చినా బాధ్యత అనేది తెలీదు. ఇంటర్‌లో రెండుసార్లు తప్పాడు. మళ్లీ పరీక్షలకు కూర్చోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. చిన్నవాడు ఈసారి పదవ తరగతి ఫెయిలయ్యాడు. తాను ఇక్కడ, వాళ్లు అక్కడ. తల్లి అంటే భక్తి, భయం లేదు. వారిని అదుపులో పెట్టేవారు లేకపోయారు.

తాను అష్టకష్టాలు పడి ఊర్లో మంచి ఇల్లు కట్టాడు, భార్యకు, కూతురుకు ఇరవై తులాల బంగారం నగలు చేయించాడు. రెండెకరాల పొలం కూడా కొన్నాడు. కాని తనకు సుఖమనేది ఉందా? ఇదేనా సంసార సారం?

మిల్లులో పని చేయడం, పండే కొటీదులో పడుకోవడం పొట్టగాళ్ల దగ్గర భోజనం. పది నెలలు బొంబాయిలో, రెండు నెలలు ఊరిలో, ఇలా గానుగెద్దు జీవితం గడపడం వల్ల ఏం సాధించాడు? ఇక్కడ తన కష్టసుఖాలు పంచుకోవడానికెవరూ లేరు. వీవరు నుండి జాబర్ ప్రమోషన్ వచ్చినప్పుడు తనకు ఎంత ఆనందం కల్గిందని! తోటివారు ఎందరు అభినందించినా తన భార్యాపిల్లలతో పంచుకునే ఆనందానుభూతికి సాటిరాదు కదా! జబ్బుపడి పడకేస్తే సేవ చేసే ఆప్తులేరి? ఎంత సహవాసులైనా తన భార్యాబిడ్డలు చూపే ఆప్యాయత, ఆదరణ చూపలేరు కదా?

ఇలా ఆలోచనలతో భీమన్న మనసు భారమైంది. తనకు తెలీకుండానే కళ్ళ నుంచి నీళ్లు కారుతున్నాయి. అంతర్మథనం ఆగడంలేదు.

ఈ మధ్య తన ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. కాస్త పని ఎక్కువైతే అలసటగా ఉంటోంది. ఉబ్బసంగా ఉంటోంది. బ్లడ్ ప్రెషర్ పెరుగుతోంది. ఇలా ఎన్నాళ్లు తను పని చేయాలి?

ఉద్యోగానికి రాజీనామా ఇస్తే లక్ష రూపాయల పైనే వస్తుంది. కొంత డబ్బు బ్యాంకులో వేసి, మిగితా డబ్బుతో తన ఊరిలో ఏ చిన్న వ్యాపారం చేసినా ఖర్చులకు గడవకపోదు. పొలం నుండి వచ్చే వడ్లు ఎలాగూ భోజనానికి సరిపోతాయి.

అవును, అలానే చేయాలి!

ఇంతవరకూ డబ్బు పంపి చేతులు దులుపుకున్న తాను, ఇంటికి నిజమైన కర్తగా ప్రవర్తించాలి. ఒక డబ్బు సంపాదించే మిషనులా కాక, అనుభూతులు, అనురాగాలు పంచుకునే ఆప్తుడిలా రూపొందాలి. తన కూతురు కాపురం నిలబెట్టాలి. వక్ర మార్గాన పడ్డ తన కొడుకులను దారి మళ్లించాలి. వారికి సరైన మార్గం చూపించాలి. అప్పుడే తన జన్మ సార్థకం అవుతుంది.

ఇలా అనుకోగానే భీమన్న మనసు కుదుట పడింది. ఆ తర్వాత అతను హాయిగా నిద్ర పోగలిగాడు.

రాత్రి తను తీసుకున్న నిర్ణయం, భీమన్న అమలు పరిచాడంటారా? నెలకు నాలుగు వేల జీతం వచ్చే ఉద్యోగం, అతను వదులుకున్నాడంటారా? లేక సారా నిషాలో తీసుకున్న నిర్ణయం, ఆ మైకం దిగిపోగానే వీగిపోయిందంటారా? జవాబు లేని, రాని ప్రశ్నలు ఇవి!

**(రచన మాసపత్రిక జులై 1995)**